సాక్షి ఒడిశా
గురువారం । 16 । నవంబర్ । 2023



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 6,09,220
వెండి	29 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



తొమ్మిదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థిని హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

- 8లో



రాష్ట్రపతి పర్యటన ఖరారు

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్ర పర్యటనకు విచ్చేస్తున్నారు. రెండు విడతల్లో 2 రోజులు రాష్ట్రంలో పర్యటించనున్నారు.

- 8లో

ఆకట్టుకున్న మత్స్య, ప్రాణిసంపద మేళా



మేళాకు విచ్చేసిన గ్రామీణ ప్రజలు



అవగాహన కోసం ఏర్పాటు చేసిన చేపల చెరువు



ఆకట్టుకున్న రకరకాల కోళ్లు



మేళాకు విచ్చేసిన జిల్లాకలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్



వివిధ రకాల కోళ్ల జాతుల గుడ్లు



కనుజు పిట్టలు, వివిధ రకాల కోళ్లు

పర్లాకిమిడి: ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లో జిల్లా స్థాయి మత్స్య, ఇతర ప్రాణిసంపద మేళా బుధవారం వైభవంగా జరిగింది. కార్యక్రమాన్ని రాష్ట్ర మత్స్య, ప్రాణిసంపద అభివృద్ధిశాఖ, సెక్రటరియేట్ కార్యదర్శి సురేష్ కుమార్ వశిష్ఠ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. గౌరవ అతిథులుగా జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్, డైరెక్టర్, పశ్చిమబెంగాల్ (ఫిషరిష్ రీసెర్చి ఇనిస్టిట్యూట్) సీఐ బసంత్‌కుమార్ దాస్, డైరెక్టర్, ఫిషరీస్ (భుభనేశ్వర్) ప్రమోద్ కుమార్ సాహు విచ్చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాసన కార్యదర్శి సురేష్ కుమార్ వశిష్ఠ వర్సిటీలో ప్రాణిసంపద, వివిధ జాతుల కోళ్లు, చేపల పెంపకం, వాటి దాణాపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. చేపలు, కోళ్లు, పాడి పరిశ్రమ ద్వారా గ్రామీణ యువతకు ఉపాధి లభిస్తోందని రాష్ట్ర శాసన కార్యదర్శి రేష్ కుమార్ వశిష్ఠ అన్నారు. ప్రభుత్వం అన్ని జిల్లాలో చేపలు, కోళ్ల పెంపకానికి సబ్సిడీపై రుణాలు మంజూరు చేస్తోందని.. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ అన్నారు. గుడ్ల ఉత్పత్తిలో గజపతి జిల్లా పొరుగున ఉన్న రాష్ట్రాలకు ఉత్పత్తి రెట్టింపు అయ్యిందని జిల్లా పరిషత్ అధ్యక్షుడ్ జి.తిరుపతిరావు అన్నారు. జిల్లాలో గుమ్మా, నువాగడ, రాయఘడ, రామగిరి ప్రాంతాల్లో స్వయం సహాయక గ్రూపులు జిల్లా స్థాయి మత్స్య, ప్రాణిసంపద మేళాకు విచ్చేశారు.

న్యూస్‌రీల్

ఆందోళనలకు బీజేపీ సన్నద్ధం

- వెల్లడించిన గంజాం జిల్లా పార్టీ అధ్యక్షుడు



మాట్లాడుతూ సుభాష్ సాహు

బరంపురం: ఒడిశా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో అతిపెద్ద జిల్లాగా గుర్తింపు పొందిన గంజాం జిల్లాలో ఉద్యమానికి నాయకులు సన్నద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చేపట్టాల్సిన ప్రజా అభివృద్ధి సమస్యలపై త్వరలో ఆందోళనలు చేపతామని గంజాం జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ సుభాష్ సాహు చెప్పారు. స్థానిక కేకే విశ్వవిద్యాలయం రోడ్డులోని అభినందన కల్యాణ మండపం ప్రాంగణంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా అభివృద్ధి పనులు చేపట్టనందుకు నిరసనగా జిల్లాలోని 17 ఎన్‌ఏసీలు, 22 బ్లాక్ కార్యాలయాల ఎదుట అందోళనలు చేపట్టనున్నట్లు వివరించారు. విలేకర్ల సమావేశంలో పార్టీ నాయకుడు కన్ను చరణ్ పతి, మహిళా మోర్చా ప్రతినిధి సబితా పాత్రో, యువమోర్చ ప్రతినిధి సునిల్ సాహు పాల్గొన్నారు.

పంట నష్టం..రైతు ఆత్మహత్య

భువనేశ్వర్: పంట నష్టాన్ని తట్టుకోలేక ఓ రైతు విషం (పురుగుల మందు) తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బొలంగీర్ జిల్లా పుంయితొలా మండలం బుబెల్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడు రమేష్ భొయ్ (50)గా గుర్తించారు. మంగళవారం విషం తాగడంతో ప్రాణాపాయ స్థితిలో చిక్కుకున్న రమేష్‌ను వెంటనే బొలంగీరు భీమ భొయ్ వైద్య బోధన ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఈయన 10 ఎకరాల భూమిలో పంటలు సాగు చేశాడు. తెగుళ్ల దాడితో ఐదు ఎకరాల్లో పంట దెబ్బతింది. స్థానిక మార్కెట్‌లో కొనుగోలు చేసిన పురుగుమందులు నాసిరకమని తేలడంతో తట్టుకోలేక ఆత్మహత్య పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

నాటుసారాతో ఇద్దరి అరెస్టు

జయపురం: నాటుసారా విక్రయించేందుకు వెళ్తున్న ఇద్దరిని జయపురం ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడిన వారిలో జయపురం సమితి అంతా పంచాయతీ బయాగుడకు చెందిన బుటులు హరిజన్(38), బరిణిపుట్ పంచాయతీ ముండాగుడకు 43 ఏళ్ల మహిళ ఉన్నట్లు ఎక్సైజ్ అధికారి మిశ్రా తెలిపారు. ఇద్దరినీ కోర్టులో హాజరు పరిచి అనంతరం జైలుకు తరలించామని చెప్పారు. ఈ దాడుల్లో మిశ్రా, ఎక్సైజ్ ఏఎస్ఐ ఎం.లక్ష్మణరావు, ప్రదీప్ కుమార్ దొలాయి తదితరులు పాల్గొన్నారు.

మగువల న్యాయ పోరాటం



న్యాయం కోసం ఢిల్లీకి కాలినడకన బయలుదేరిన ఆదివాసీ మహిళలు

జయపురం: చిత్రంలో కనిపిస్తున్న ఇద్దరు ఆదివాసీ మహిళలు. కొరాపుట్ జిల్లా లమతాపుట్ గ్రామానికి చెందిన పార్వతీ మరియు, దయమతి మరియు అనే వీరిద్దరూ అక్కాచెల్లెళ్లు. కొరాపుట్ గ్రామం నుంచి కాలినడకన దేశ రాజధాని ఢిల్లీకి వెళ్తున్నారు. తమపై లైంగిక దాడి జరిగిందని ఫిర్యాదు చేస్తే ఆలకించిన నాథుడు లేకపోయాడని, పోలీసులు కూడా న్యాయం చేయకపోవడంతో ఢిల్లీకి వెళ్లి ప్రధాని, రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కలుస్తామని చెబుతున్నారు. పాదయాత్రలో భాగంగా బుధవారం వారు జయపురం కోవిడ్ హాస్పిటల్ ముందుగల గుప్తేశ్వర్ కాంప్లెక్సు ప్రాంగణంలో గల సహిద్ లక్ష్మణ నాయిక్ ప్రతిమ ముందు మాట్లాడారు.

వారి ఆవేదన వారి మాటల్లోనే..

2016లో కొందరు బీజేడీ నేతలపై మాపై లైంగిక దాడికి పాల్పడ్డారు. దీనిపై లమతాపుట్ పోలీసుల నుంచి కలెక్టర్, ఎస్పీ వరకు అందరినీ వేడుకున్నాం. కానీ ఎవరూ స్పందించలేదు. కొరాపుట్ ఎస్పీ కార్యాలయం ముందు ఉన్న చెట్టు కింద ధర్నా కూడా చేశాం. కానీ మాకు న్యాయం చేయాల్సిన పోలీసులు మేము ఆత్మహత్యకు పాల్పడుతున్నామని కేసు కట్టి జైలుకు పంపించారు. బెయిల్‌పై బయటకు వచ్చాక మళ్లీ మేం న్యాయ పోరాటం ప్రారంభించాం. రాష్ట్ర విధాన సభ ముందు 160 రోజులు ధర్నా చేశాం. అయినా న్యాయం దొరకలేదు. అందుకే మరోదారి లేక ఢిల్లీకి వెళ్లాలని నిర్ణయించుకున్నాం. అక్కడ ప్రధాని, రాష్ట్రపతి, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిని కలిసి మా కష్టం చెబుతాం. సీబీఐతో దర్యాప్తు చేయించాలని కోరుతాం. అక్కడ న్యాయం జరగకపోతే ఇక ఒడిశాకు తిరిగి రాము. దోషులను కఠినంగా శిక్షించి తీరాలి, మాపై తప్పుడు కేసులు పెట్టడం మానుకోవాలి. అని వారు తెలిపారు.

స్వామి స్వరూపానందగిరిపై దాడి



స్వామీజీని పరామర్శిస్తున్న ప్రముఖులు, (ఇన్‌సెట్లో) స్వామీజీ తలపై గాయం

- వాహనానికి దారి ఇవ్వాలని కోరినందుకు యువకుడి దుశ్చర్య
- తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరిక

రాయగడ: జిల్లాలోని కళ్యాణసింగుపూర్‌లో శైవక్షేత్రమైన దేవగిరిపై ఉన్న క్రాంతికారి ఆశ్రమానికి చెందిన స్వామి స్వరూపానందగిరిపై ఓ యువకుడు రాడ్డుతో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన స్వామీజీని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. స్వామి స్వరూపానందగిరి మంగళవారం సాయంత్రం తన ఆశ్రమంలో గోశాలకు సూచిక బోర్డు తయారుచేసేందుకు కల్యాణసింగుపూర్‌లోని వెల్డింగ్ గ్యారేజీకి సొంత వాహనంపై బయల్దేరరారు. గ్యారేజీ సమీపించేసరికి పక్కనే కొందరు ఆకతాయిల గుంపు ఉండటంతో దారి ఇవ్వాలని హారన్‌కొట్టారు. దీంతో గుంపులోని ఓ వ్యక్తి స్వామీజీతో ఘర్షణకు దిగాడు. అసభ్యపదజాలంతో దూషించడంతో స్వామీజీ వాహనం దిగి యువకుడిని నచ్చజెప్పి పంపించేశారు. అనంతరం గ్యారేజీకి చేరుకున్న స్వామీజీ బోర్డు విషయమై యజమానితో మాట్లాడుతుండగా వెనుక నుంచి ఓ వ్యక్తి ఇనుప రాడ్డుతో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో స్వామి తల,ముఖంపై తీవ్ర గాయాలు కావడంతో కింద పడిపోయారు. మరోసారి అగంతకుడు దాడి చేస్తుండటంతో అక్కడి వారు అడ్డుకుని స్వామీజీని ఆస్పత్రికి తరలించారు.

అతనితో శత్రుత్వం లేదు

తీవ్రంగా గాయపడిన స్వామీజి చికిత్స అనంతరం ఆశ్రమానికి చేరుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నందున డిశ్చార్జ్ చేశామని వైద్యులు తెలిపారు. కాగా, తనకు ఎవరితో ఎటువంటి శతృత్వం లేదని స్వామీజి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆశ్రమం నిర్వహిస్తూ తన పని తాను చేసుకుంటున్నానని, తనపై ఇటువంటి దాడులు జరగడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై దాడి చేసిన వ్యక్తిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

పలువురి పరామర్శ..

స్వామీజీపై జరిగిన దాడిని పలువురు ఆధ్యాత్మికవేత్తలు ఖండించారు. రాయగడకు చెందిన స్వామీ చైతన్యరాంజీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బసంతకుమార్ ఉలక, సీనియర్ జర్నలిస్ట్ బాదల్ కుమార్ థా, ఆర్ఎస్ఎస్ పశ్చిమ ఒడిశా సేవా ప్రముఖులు దీపక్ రౌత్, అల్లు శంకర్ తదితరులు స్వామి ఆశ్రమానికి చేరుకుని పరామర్శించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరారు.

సైక్లోన్ అలెర్ట్



భువనేశ్వర్: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కేంద్రీకృతమైంది. క్రమంగా వాయుగుండంగా మారి తీర ప్రాంతాల్ని ప్రభావితం చేసే ముప్పు పొంచి ఉంది. దీంతో ఆయా ప్రాంతాల్లో పరిస్థితిని నిశితంగా పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్లను బుధవారం ఆదేశించింది. ఈ మేరకు ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్ఆర్‌సి) సత్యబ్రత సాహు అన్ని జిల్లాల కలెక్టర్లకు లేఖలు రాశారు. ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసిన ప్రాంతాల్లో ఆకస్మిక మార్పులు గమనిస్తూ ఉండాలని హెచ్చరించారు. ఉపద్రవాన్ని ఎదుర్కొనేందుకు అనుబంధ యంత్రాంగాన్ని సిద్ధం చేసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాల ప్రజలను తాత్కాలికంగా సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. వాతావరణంపై నిఘా ఉంచాలని, ఉరుములతో కూడిన వాతావరణ పరిస్థితుల్లో సురక్షిత ఆశ్రయంపై ప్రజలకు అవగాహన కల్పించి రక్షణ చర్యల ప్రణాళికతో సిద్ధం చేసుకోవాలన్నారు.

మత్స్యకారులకు హెచ్చరిక

భారత వాతావరణ శాఖ అనుక్షణం జారీ చేసే వాతావరణ సూచనలపై మత్స్యకారులు కట్టుబడి ఉండాలని, సూచనలకు అనుగుణంగా సముద్రంలో చేపల వేట పట్ల అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. మండీల్లోని కూరగాయలు, ఉద్యాన పంటలు, నిలిచిన వరి పంటలు, పండిన పంటలు మరియు వరిని రక్షించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. భారీ నుంచి అతిభారీ వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ శాఖ ఐఎండీ సమాచారం ఉందని, అల్పపీడనం తొలుత వాయువ్య దిశగా, ఆ తర్వాత ఉత్తర వాయువ్య దిశగా కదులుతూ గురువారం ఉదయం ఆంధ్రప్రదేశ్ తీరానికి ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆ తర్వాత, ఇది ఈశాన్య దిశగా తిరిగి ఈ నెల 17న ఒడిశా తీరంలోని వాయువ్య బంగాళాఖాతం మీదుగా చేరుకుంటుంది. పూరీ, కేంద్రాపడా, కటక్, జగత్‌సింగ్‌పూర్, భద్రక్, బాలాసోర్ వంటి జిల్లాలకు వాతావరణ శాఖ పసుపు హెచ్చరిక జారీ చేసింది.

ఝార్సుగుడ టు బెంగళూరు

- విమాన సేవలు ప్రారంభం



వాటర్ క్యానన్‌లతో కొత్త విమాన సేవలు ప్రారంభం



కేక్ కట్ చేస్తున్న కొత్త విమాన సిబ్బంది

భువనేశ్వర్: ఝార్సుగుడ, బెంగళూరు మధ్య ప్రత్యక్ష విమానయాన సౌకర్యం బుధవారం నుంచి అందుబాటులోకి వచ్చింది. ఇండిగో సంస్థ ఈ సేవలు కల్పిస్తోంది. ఈ సందర్భంగా ఝార్సుగుడ వీర సురేంద్ర సాయి విమానాశ్రయం నుంచి వాటర్ క్యానన్‌లతో కొత్త విమానాలకు స్వాగతం పలికారు. ఎయిర్‌బస్సు-320 నియో బుధవారం మధ్యాహ్నం 12.50 గంటలకు ఝార్సుగుడ వీర్ సురేంద్ర సాయి విమానాశ్రయం నుంచి బయల్దేరి 2.55 గంటలకు బెంగళూరు చేరింది. బెంగళూరు నుంచి ఉదయం 10.15 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 12.20 గంటలకు ఝార్సుగుడ చేరుతుంది. ఝార్సుగుడ, కోల్‌కతా మధ్య ప్రత్యక్ష విమానాలు ప్రారంభించిన 10 రోజుల స్వల్ప వ్యవధిలో బెంగుళూరుకు ప్రత్యక్ష విమానయాన సౌకర్యం కల్పించడం విశేషం. ఈ కొత్త విమానయాన సౌకర్యం అంతర్-రాష్ట్ర అనుసంధానాన్ని బలోపేతం చేస్తుంది. పారిశ్రామికంగా కీలకమైన ఝార్సుగుడ ప్రాంతానికి ఆర్థిక, వ్యాపార రీత్యా ఈ సేవలు దోహదపడతాయని ఇండిగో గ్లోబల్ సేల్స్ హెడ్ వినయ్ మల్హోత్రా తెలిపారు. దేశీయ విమానయాన సౌకర్యం పటిష్టం చేస్తూ ఝార్సుగుడ నుంచి ప్రముఖ ప్రాంతాలకు ప్రయాణ కార్యకలాపాలు ప్రారంభించడంపై ఆనందం వ్యక్తం చేశారు. కోల్‌కతా, బెంగళూరు వంటి ప్రధాన మెట్రోపాలిటన్ హబ్‌లకు ఝార్సుగుడ నగరాన్ని అనుసంధానించడం, ప్రయాణ వనరులు విస్తరించడంతో ఈ ప్రాంతం ఆర్థిక వృద్ధి జరుగుతుందన్నారు.

క్విజ్ విజేతలకు బహుమతుల ప్రదానం



క్విజ్ పోటీలలో పాల్గొన్న విద్యార్థినులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జిల్లా జడ్జి సత్యనారాయణ మిశ్ర

జయపురం: బాలల దినోత్సవం సందర్భంగా కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం వారు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో గల జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ సభాగృహంలో నిర్వహించిన క్విజ్ పోటీలను జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ అధ్యక్షుడు, సత్యనారాయణ మిశ్రా లాంఛనంగా ప్రారంభించారు. మొదట ఇరిగేషన్ కాలనీ అరవింద పూర్ణాంగ శిక్షా కేంద్ర విద్యార్థుల మధ్య క్విజ్ పోటీలు నిర్వహించారు. స్వతంత్ర్య విజిలెన్స్ జడ్జి, న్యాయ సేవా ప్రదీకరణ కార్య నిర్వాహక అధ్యక్షుడు రాజేశ్ ఎక్కా, కార్యదర్శి సుమన్ జెన, రిజిస్ట్రార్ బిష్ణు ప్రసాద్ దేవత, విద్యాలయ ప్రధాన ఉపాధ్యాయురాలు తదితరులు చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ పోటీల్లో జన్మేజయ సెండ, కుమారి అలోక్ రుతుపూర్ణ సింహా, ద్వితిమాన మహంతిలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు.

భౌగోళిక సమాచార వ్యవస్థతో మేలు



సమాచార వ్యవస్థపై సావనీర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

- డాక్టర్ పి.ఎస్.ఆర్.శ్రీనివాస శాస్త్రి
- సెంచూరియన్ వర్సిటీలో అంతర్జాతీయ భౌగోళిక సమాచార వ్యవస్థ దినోత్సవం



సీఎస్ఎల్వీ రాకెట్ నమూనాను ప్రదర్శిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: భౌగోళిక సమాచార వ్యవస్థతో నిత్య జీవితంలో ఎంతో మేలు జరుగుతుందని భారత రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థకు చెందిన డాక్టర్ పి.ఎస్.ఆర్.శ్రీనివాస శాస్త్రి అన్నారు. స్థానిక ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్ ఆడిటోరియంలో అంతర్జాతీయ భౌగోళిక సమాచార వ్యవస్థ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భౌగోళిక సమాచారం కోసం కేంద్ర ప్రభుత్వం శాటిలైన్ వ్యవస్థను కలిగి ఉందని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో కృత్రిమ మేధస్సు, నీటి వనరుల వినియోగం, అర్బన్ ప్లానింగ్, పర్యావరణం ఎలా కాపాడుకోవాలి, వ్యవసాయం మరియు ఇతర అనుబంధ సైన్సులు, విపత్తుల నివారణ నిర్వహణ, మెషీన్ లెర్నింగ్, సాంకేతిక పరిజ్ఞానం వంటి విషయాలపై ప్రపంచవ్యాప్తంగా పరిశోధకులు, ఫ్యాకల్టీల నుంచి 282 పరిశోధన పేపర్లు అందగా, వాటిలో 169 ఎంపిక చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో వైజ్ఞానికుడు డా.పి.రాజా, సెంచూరియన్ వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎస్.రావు, రిజిస్ట్రార్ డా.సుప్రియా పట్నాయిక్, డీన్ డా.అనితా పాత్రో, డా.ఆశిష్ రంజన్ దాస్, ప్రోగ్రాం కన్వీనర్ ప్రొ.ప్రఫుల్ల కుమార్ పండా, డాక్టర్ గిరీష్ చంద్ర కోఠయారి తదితరులు పాల్గొన్నారు.

చివరి మజిలీకి ఇబ్బందిలేకుండా..

- పూరీ స్వర్గద్వార్‌లో ఏర్పాట్లు
- దహన సంస్కారాల వెబ్‌సైట్ ప్రారంభం



పూరీ స్వర్గ ద్వార్ ప్రాంగణం

భువనేశ్వర్: పవిత్ర పుణ్యక్షేత్రం పూరీ సాగరతీరం స్వర్గద్వార్ శ్మశాన వాటికలో దహన సంస్కారాలు అత్యంత మోక్షదాయకంగా భావిస్తారు. ఈ ప్రాంగణంలో దహన సంస్కారాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అధికారులు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో స్థానిక జిల్లా యంత్రాంగం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇకపై మృతదేహాలను దహనం చేసేందుకు సంబంధీకులు గంటల తరబడి నిరీక్షించాల్సిన అవసరం లేదు. పూరీ జిల్లా యంత్రాంగం దీపావళి సందర్భంగా పూరీ సాగర తీరం స్వర్గద్వార్‌లో అందుబాటులో ఉన్న అన్ని సేవలను అందించే వెబ్‌సైట్‌ను - httpr://swargadwar.com/ ప్రారంభించింది. స్వర్గద్వార్ గురించి అవసరమైన సమగ్ర సమాచారం ఒడియా, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో అందుబాటులో ఉంచింది. ఈ శ్మశానవాటికలో దహన సంస్కారాలకు అవసరమైన సమగ్ర సమాచారం అప్‌లోడ్ చేశారు. దీని ద్వారా ప్రజలు తమ దగ్గరి, ప్రియమైన వారి మృతదేహాలను దహనం చేయడానికి సులభ రీతిలో సేవలను పొందగలుగుతారు. దహన సంస్కారాల కోసం స్వర్గద్వార్‌ను సందర్శించే వారికి సహాయం చేయడానికి అందుబాటులో ఉన్న స్వర్గద్వార్ సంస్కార్ సేవక్‌లకు ఆర్థిక సహాయం అందించనున్నట్టు అధికారవర్గాలు వెల్లడించారు.

ప్రయోగాత్మకంగా..

వెబ్‌సైట్‌ను ప్రయోగాత్మకంగా ప్రారంభించామని స్వర్గద్వార్ సేవా సమితి ఎక్స్-అఫీషియో కన్వీనర్ కమ్ సెక్రటరీ పూరీ సబ్ కలెక్టర్ భవతరణ్ సాహు తెలిపారు. అవసరాన్ని బట్టి సవరిస్తామని చెప్పారు. స్వర్గద్వార్ యాప్ త్వరలో గూగుల్ ప్లే స్టోర్ ద్వారా కూడా అందుబాటులోకి వస్తుందని చెప్పారు.

కమాన్ ఇండియా!

క్రికెట్ ప్రపంచకప్-2023లో భాగంగా సెమీఫైనల్ పోరులో న్యూజిలాండ్‌పై భారత్ జట్టు గెలవాలని ఆకాంక్షిస్తూ పూరీ బీచ్‌లో సైకత కళాకారుడు సుదర్శన్ పట్నాయక్ అద్భుతంగా సైకత శిల్పం రూపొందించారు. టీమ్ ఇండియాకు వినూత్నంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

- భువనేశ్వర్



క్లుప్తంగా

ఫైనాన్స్ కంపెనీ ఉద్యోగి మోసంపై ఫిర్యాదు

టెక్కలి రూరల్: శ్రీరాం ఫైనాన్స్ టెక్కలి బ్రాంచ్‌లో పనిచేస్తున్న ఉపేంద్ర అనే ఉద్యోగి పలువురు ఖాతాదారుల సొమ్ముతో పరారయ్యాడు. ఈ మేరకు బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. తాజాగా రుణ చెల్లింపు విషయంలో పలువురు ఖాతాదారులకు సంస్థ నుంచి నోటీసులు అందడంతో పలాస మండలం అంతరకుడ్డ ప్రాంతం నుంచి ఓ మహిళ, టెక్కలి మండలం అక్కవరం గ్రామానికి చెందిన కె.శ్రీరాములు అనే వ్యక్తి బుధవారం టెక్కలి బ్రాంచికి వెళ్లి సిబ్బందిని నిలదీశారు. గతంలో తాము తీసుకున్న రుణాన్ని పూర్తిగా కట్టినా మళ్లీ చెల్లించాలని నోటీసులు ఎందుకు పంపించారని ప్రశ్నించారు. తమ అనుమతి లేకుండా సంతకాలు ఫోర్జరీ చేసి లోన్ పెట్టినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భూసేకరణ యూనిట్-4 కొనసాగించాలని వినతి

శ్రీకాకుళం రూరల్: జిల్లాలోని ఆమదాలవలసలో కొనసాగుతున్న భూసేకరణ యూనిట్-4ను కొనసాగించాలంటూ ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఉద్యోగుల సంఘ సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు. మొత్తం నాలుగు యూనిట్లకు గాను 2022 మేలో కొన్నింటిని రద్దు చేశారని, ప్రస్తుతం వంశధార భూసేకరణ యూనిట్-4 మాత్రమే కొనసాగుతోందని, ఇది కూడా ఈ ఏడాది డిసెంబర్ 31 నాటికి పూర్తి కానుందని వివరించారు. దీనిని కూడా రద్దు చేస్తే యూనిట్‌లో చేయాల్సిన భూ సేకరణ విస్తీర్ణ పనులు, కోర్టు కేసులు, బాధితులకు పంపిణీ చేయాల్సిన నగదు పెండింగ్‌లో ఉండిపోతాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే బీఆర్‌ఆర్ వంశధార భూసేకరణ యూనిట్-4ను కొనసాగిస్తూ, యూనిట్ 3ను పునరిద్ధరించాలని విన్నవించారు.

నాలుగు రోజుల్లో 52 కేసులు

అరసవల్లి: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో అక్రమ విద్యుత్ వినియోగాలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. నాలుగు రోజులుగా పలు ప్రాంతాల్లో తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విభాగమైన డీపీఈ సిబ్బందితో కలిసి ఏపీటీఎస్ సిబ్బంది సమన్వయంగా జరిపిన దాడుల్లో ఏకంగా 52 కేసులు నమోదయ్యాయని విజిలెన్స్ సీఐ వెంకటనారాయణ తెలిపారు. ఈ నెల 2న 16, 8వ తేదీన 16, 15న 20 చొప్పున కేసులు నమోదు చేసి అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు.

ఉత్సాహంగా అండర్-19 అథ్లెటిక్స్ ఎంపికలు



లాంగ్‌జంప్‌లో ఓ అథ్లెట్ విన్యాసం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్కూల్‌గేమ్స్ అండర్-19 బాలబాలికల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం మైదానం వేదికగా బుధవారం జరిగిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. రన్స్, త్రోస్, జంప్స్ విభాగాల్లో ప్రతిభ నిరూపించుకున్నారు. మెరుగైన ట్రాక్ రికార్డులను కలిగిన క్రీడాకారుల వివరాలను నమోదు చేసుకున్నారు. తుది జాబితాను త్వరలో వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.వి.రమణ, పీఈటీ సంఘ నాయకులు ఎం.సాంబమూర్తి, కె.మాధవరావు, చంద్రశేఖర్, ఆనంద్‌కిరణ్, సన్నిబాబు, పీడీలు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ముగిసిన ఐటీఈపీ దరఖాస్తుల స్వీకరణ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది ప్రారంభిస్తున్న ఐటీఈపీ కోర్సు దరఖాస్తుల స్వీకరణ బుధవారంతో ముగిసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన ఎన్‌సీఈటీ -2023 పరీక్షలో అర్హత పొందిన వారు దరఖాస్తు చేసుకున్నారు. షెడ్యూల్ మేరకు వచ్చిన దరఖాస్తుల్లో టెస్టు మార్కులు స్కోర్, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా గురువారం మెరిట్ లిస్టు ప్రకటించనున్నారు. ఎంపికైన విద్యార్థుల నుంచి 17, 18 తేదీల్లో ఫీజులు స్వీకరించి ప్రవేశాలు కల్పిస్తారు. 20న మిగులు సీట్లు ప్రకటిస్తారు. 21న రెండో విడత ప్రవేశాలు కల్పిస్తారు. 22న రెండో కౌన్సెలింగ్ విద్యార్థుల నుంచి ఫీజులు స్వీకరించనున్నారు. 23న ప్రవేశాలు పొందిన విద్యార్థులకు వసతి గృహం సీట్లు కేటాయిస్తారు. 23 నుంచి తరగతులు ప్రారంభిస్తారు.

కొండలపై కెమెరాలు

టెక్కలి రూరల్: మండలంలోని మేఘవరం పంచాయతీ పరిధిలో జక్కరపేట, జీడిపేట గ్రామ సమీప కొండలపై పులి సంచరిస్తున్నట్లు గుర్తించిన అటవీ శాఖాధికారులు దాని ఉనికిని గుర్తించేందుకు కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా జీడిపేట సమీపంలో జీడిరాయిల మెట్ట వద్ద కొలనకు ఆనుకుని మూడు కెమెరాలు ఏర్పాటు చేసినట్లు అటవీశాఖ రేంజర్ జగదీశ్వరరావు బుధవారం తెలిపారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

రాష్ట్రపతి పర్యటన ఖరారు



రాష్ట్రపతి రాష్ట్ర పర్యటన ఏర్పాట్లు సమీక్షించిన చీఫ్ సెక్రటరీ ప్రదీప్ కుమార్ జెనా.

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్ర పర్యటనకు విచ్చేస్తున్నారు. ఈ పర్యటన రెండు విడతల్లో ఉంటుంది. తొలి విడత ఈ నెల 20 నుంచి 22 వరకు కొనసాగుతుంది. తిరిగి ఈ నెల 26, 27 తేదీల్లో 2 రోజులు రాష్ట్రపతి పర్యటించనున్నారు. ఈ పర్యటన దృష్ట్యా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా అధ్యక్షతన బుధవారం సన్నాహక సమావేశం జరిగింది. రాష్ట్రపతి రాక, పర్యటన, భద్రతా ఏర్పాట్లు మొదలైన వాటికి సంబంధించిన వివరణాత్మక చర్చలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, రాష్ట్రపతి పర్యటన కార్యక్రమానికి సంబంధించిన కార్యనిర్వాహకులు సమావేశానికి హాజరయ్యారు.

మతాబులు కొనేందుకు వెళ్లి..

● బైక్ ప్రమాదంలో విద్యార్థి మృతి

జయపురం: మతాబులు కొనేందుకు హాస్టల్ గోడ దూకి వెళ్లిన ఉజన్ కిరసాని అనే విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన కొరాపుట్ జిల్లా లమతాపుట్ సమితిలో జరిగింది. ఆ సమితి బలేల్ గ్రామంలో గల ఆదివాసీ విద్యాలయ హాస్టల్‌లో ఉంటున్న ఏడో తరగతి విద్యార్థి ఉజన్ కిరసాని, 9వ తరగతి విద్యార్థి బబుల కిరసానిలు దీపావళి మతాబులు కొనేందుకు ఆదివారం సాయంత్రం హాస్టల్ గోడదూకి వెళ్లారు. బబుల ఇంటికి వెళ్లి తన తండ్రి బైక్ తీసుకువచ్చాడు. ఇద్దరూ కలిసి మతాబులు కొనేందుకు లమతాపుట్ వెళ్లారు. వాటిని కొని తిరిగి వస్తుండగా కమేల్ సమీపంలో బైక్ ప్రమాదానికి గురైంది. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడగా వారిని లమతాపుట్ ఆశాకిరణ్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స చేసి ఉజన్‌ను మెరుగైన వైద్యం కోసం మరో ఆస్పత్రికి తీసుకెళ్లమని సూచించగా అతడిని నవరంగపూర్ ఆస్పత్రికి తర్వా



బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి పడి ఉన్న విద్యార్థులు

వైజాగ్ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తాత మాచ్‌ఖండ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై బుధవారం లమతాపుట్ బీడీఓ, బీఈఓ, వెల్ఫేర్ విభాగ అధికారి తదితరులు పాఠశాలకు వెళ్లి విచారణ చేశారు. హాస్టల్ నిర్వాహకుల కారణంగానే విద్యార్థులకు బయటకు వెళ్లారని పలువురు ఆరోపించారు.

తొమ్మిదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

మల్కన్‌గిరి: కలిమెల సమితి మోటు పోలీసుస్టేషన్ పరిధిలో గల మోటు గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న పూజ కుంజ (15) హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది.



పూజ కూంజా (ఫైల్)

ఇక్కడి మధుసూదన్ ఆశ్రమ పాఠశాలలో వంద పడకలు ఉన్నాయి. బుధవారం బిర్సాముండా జయంతిని పాఠశాలలో నిర్వహించగా హాస్టల్ పిల్లలంతా వెళ్లారు. ఇంతలో ఏం జరిగిందో గానీ తిరిగి వచ్చి చూసే సరికి పూజ కుంజ ఓ తరగతి గదిలో ఉరికి వేలాడుతూ కనిపించాడు. పిల్లలంతా భయంతో కేకలు వేయడంతో హాస్టల్ సిబ్బంది, ఉపాధ్యాయులు వచ్చి చూశారు. అప్పటికే విద్యార్థిని మృతి చెందింది. దీనిపై వారు విద్యార్థిని తల్లిదండ్రులతో



విద్యార్థిని తండ్రి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

పాటు పోలీసులకు సమాచారం అందజేశారు. పూజ స్వగ్రామం గినిపల్లి. దీనిపై మోటు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తమ బిడ్డ ఎందుకు ఈ అఘాయిత్యానికి పాల్పడిందో తెలీదని విద్యార్థిని తండ్రి దుల కన్నీరుమున్నీరయ్యారు.

దాశరథీపురంలో పట్టపగలే చోరీ

కొత్తూరు : గ్రామంలో పెద్దలంతా పొలం పనులకు వెళ్లిపోయారు.. పిల్లలు పాఠశాలకు వెళ్లారు.. గ్రామం నిర్మానుష్యంగా ఉంది.. ఇదే అదునుగా దుండగులు ఓ ఇంట్లో చొరబడి బంగారు ఆభరణాలు, నగదు పట్టుకుపోయారు. ఈ ఘటన కొత్తూరు మండలం దాశరథీపురంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దాశరథీపురం గ్రామానికి చెందిన గేదెల తవిటినాయుడు, భార్య పద్మాలు ఎప్పటిలాగే బుధవారం ఉదయం 8 గంటల సమయంలో వరి చేలు చేసేందుకు పొలానికి వెళ్లారు. తవిటినాయుడు అయ్యప్ప మాలధారణలో ఉన్నందున సన్నిధానానికి వెళ్లేందుకు ఉదయం 11 గంటల సమయంలో పొలం నుంచి ఇంటికి వచ్చాడు. ఇంటి తాళం పగలుగొట్టడం గమనించి లోపలకు వెళ్లి చూడగా బీరువా తాళాలు పగలు గొట్టి ఉన్నాయి. దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు



ఇంటిని పరిశీలిస్తున్న సీఐ వేణుగోపాలరావు

ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని సీఐ ఆర్.వేణుగోపాలరావు పరిశీలించారు. శ్రీకాకుళం నుంచి క్లూస్ టీమ్ వేలిముద్రలు సేకరించారు. బంగారంతో పాటు అంబలం పూజ కోసం అప్పు చేసి దాచుకున్న నగదు సైతం చోరీకి గురైనట్లు తవిటినాయుడు వాపోయారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ధర్మారావు చెప్పారు.

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కరిక్యులమ్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది ప్రారంభిస్తున్న నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యాయ విద్యాకోర్సు (ఐటీఈపీ)లో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కరిక్యులమ్ రూపొందిస్తున్నట్లు న్యూఢిల్లీకి చెందిన జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి సభ్యులు ఘంటా రమేష్ అన్నారు. వర్సిటీ పాలక మండలి సమావేశ మందిరంలో బుధవారం రెండో రోజు కరిక్యులమ్ డిజైన్ వర్కుషాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా విధానం నేపథ్యంలో ఐటీఈపీ కోర్సుకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. దేశంలో కొన్ని విశ్వవిద్యాలయాల్లో ప్రారంభిస్తున్న ఈ కోర్సుకు ఈ ఏడాది బీఆర్ఏయూలో శ్రీకారం చుట్టడం శుభపరిణామం



వర్కు షాపులో పాల్గొన్న విద్యారంగ నిపుణులు

గా పేర్కొన్నారు. ఎంపీసీ, హెచ్‌ఈపీ డిగ్రీతో పాటు బీఎడ్ అర్హత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన స్టేట్ రిసోర్సు సెంటర్ పూర్వపు డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.పద్మనాభయ్య, విద్యావేత్తలు బీఎస్ పాండే, డి.రామకృష్ణయ్య, విజయవర్ధని తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో తేజేశ్వరికి రజతం

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర సీనియర్స్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన కుంచాల తేజేశ్వరి రజత పతకం సాధించి శభాష్ అనిపించింది. విశాఖపట్నం వేదికగా ఈ నెల 13 నుంచి 15 వరకు జరిగిన పోటీల్లో తేజేశ్వరి 58-63.5 కేజీల విభాగంలో రాణించింది. ఈమె శ్రీకాకుళం పీఎస్ఎన్ఎం హైస్కూల్ వేదికగా మాస్టర్ మైండ్స్ వారియర్స్ బాక్సింగ్ క్లబ్‌లో మాజీ సైనికుడు, బాక్సింగ్ కోచ్ కె.పురుషోత్తం వద్ద శిక్షణ పొందుతుంది. స్వస్థలం ఆమదాలవలస మండలం సిలగాం సింగువలస. తల్లిదండ్రులు రామారావు, లక్ష్మిలు వ్యవసాయం చేస్తుంటారు. తేజేశ్వరి శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదువుతోంది.



బాక్సింగ్ కోచ్ పురుషోత్తంతో కుంచాల తేజేశ్వరి

తేజేశ్వరిని కోచ్‌తో పాటు క్లబ్ అధ్యక్షుడు టి.తారకనాథ్, కార్యదర్శి బి.సురేష్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, బాక్సింగ్ సంఘ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

నేటి నుంచి శ్రీ మందిరంలో మరమ్మతులు

భువనేశ్వర్:

ప్రఖ్యాత పూరీ క్షేత్రంలో జగమోహన్, నాట్య మండపాల మరమ్మతు పనులను గురువారం నుంచి ప్రారంభించాలని హైకోర్టు భారత పురావస్తు శాఖ (ఏఎస్‌ఐ)ను బుధవారం ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబరు 4వ తేదీకి వాయిదా వేశారు. హైకోర్టు ఆదేశానుసారం కోర్టు నియమించిన అమీకస్ క్యూరీ శ్రీ మందిరం జగమోహన్, నాట్య మండపం మరమ్మతు పనులను పర్యవేక్షించి, ప్రతి 15 రోజులకోసారి పురోగతికి సంబంధించిన వివరణాత్మక నివేదికలను సమర్పిస్తుంది. ఈ నెల 24న మరమ్మతు పనులు ప్రారంభించాలని ఏఎస్‌ఐ చేసిన అభ్యర్థనను హైకోర్టు సున్నితంగా తిరస్కరించింది. గురువారం నుంచి పనులు ప్రారంభించాలని ఆదేశించింది. న్యాయస్థానం నియమించిన అమీకస్ క్యూరీ గతంలో 12వ శతాబ్దపు ప్రాచీన శ్రీమందిర నిర్మాణాల్లో అరుగుదలకు సంబంధించిన ఆధారాలు కనుగొంది. నాట్య మండపంలోని దూలానికి పగుళ్లు రావడంపై అమికస్ క్యూరీ ఆందోళన వ్యక్తం చేశారు. పూరీ జగన్నాథ దేవాలయంలోని జగమోహన్ మరమ్మతుకు సంబంధించి ఏఎస్‌ఐ అఫిడవిట్‌ను కోర్టు నవంబర్ 8న తిరస్కరించి, తాజాగా సమర్పించాలని చెప్పడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఏఎస్‌ఐ దాఖలు చేసిన అఫిడవిట్‌పై హైకోర్టు అసంపూర్తి వ్యక్తం చేసింది. 12వ శతాబ్దపు మందిరం ప్రధాన నిర్మాణం మరమ్మతు కోసం తీసుకున్న చర్యలపై వివరణాత్మక సమాచారంతో తాజా అఫిడవిట్‌ను సమర్పించాలని ఆదేశించింది. 2017 సంవత్సరం నుంచి శ్రీ మందిరం సంరక్షణ కార్యాచరణపై తీసుకున్న చర్యల గురించి వివరాలను దాఖలు చేయాలని కోరింది. ఈ అంశంపై బుధవారం విచారణ చేపట్టింది. అంతకు ముందు ఈ నెల 6న, తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి బీఆర్ షడంగి ధర్మాసనం ఏఎస్‌ఐ పని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. జగమోహన్, నాట్య మండపం మరియు రత్న భాండాగారం మరమ్మతులకు 2017 నుంచి తీసుకున్న చర్యలపై ఏఎస్‌ఐ నుంచి వివరణ కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



పర్లాకిమిడి పురపాలక సంఘం కార్యాలయం వద్ద సీనియర్ సిటిజెన్స్ ఫోరం సభ్యులు

పర్లాకిమిడి: పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న వీధి కుక్కల బెడద, గోవులు, డ్రైనేజీ వ్యవస్థ, పేరుకుపోతున్న చెత్త వంటి సమస్యలు పరిష్కరించాలని పర్లాకిమిడి సీనియర్ సిటిజెన్స్ ఫోరం అధ్యక్షుడు అశ్వినీ పాఢి, కార్యదర్శి పూర్ణచంద్ర మహాపాత్రో కోరారు. ఈ మేరకు బుధవారం పురపాలక శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి బోనమాళి శతపతి, చైర్‌పర్సన్ నిర్మలా శెఠికి వినతిపత్రం అందించారు. ఫోరం సభ్యులు బినోద్ చంద్ర జెన్నా, సచ్చిదా నంద సామల్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై నిరంతర పోరాటం

శ్రీకాకుళం అర్బన్: పెన్షనర్ల సమస్యలపై స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల అసోసియేషన్ నిరంతరం పోరాటాన్ని కొనసాగిస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం ఎన్‌జీవో కార్యాలయంలో బుధవారం పెన్షనర్ల జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, ఎస్‌జీపీఏ రాష్ట్ర కార్యదర్శి ఎస్.శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాఘవరావు, జిల్లా అధ్యక్షుడు ఆర్.రామచంద్రరావు, కార్యదర్శి డి.ధర్మారావు, ట్రెజరర్ బి.మోహనరావు, అప్పారావు, పొందూరు సెక్రటరీ సూర్యప్రకాశరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.శాంతారావు, జగన్నాథరావు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: పెండింగ్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎలక్టోరల్స్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 18,28,410 మంది ఎలక్టోరల్స్ ఉన్నట్లు వివరించారు. శాసనసభ నియోజకవర్గాలలో ఈ నెల 8 నుంచి 13 వరకు 14,154 దరఖాస్తులు స్వీకరించినట్లు చెప్పారు. చేర్పులకు ఇప్పటి వరకు 18,531, తొలగింపులకు 6,409, దిద్దుబాటుకు 12,133 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఎక్కువ పెండింగ్ ఉన్న మండల తహసీల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. మొగదాలపాడులో పోలింగ్ కేంద్రం మార్పు అవకాశాన్ని పరిశీలిస్తామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, రౌతు శంకరరావు(వైఎస్సార్ సీపీ), కె.వి.రామరాజు(టీడీపీ), డి.గోవింద మల్లిబాబు(కాంగ్రెస్), బి.నారాయణరావు(బీఎస్పీ), సి సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాశరరావు తదితరులు పాల్గొన్నారు.

చీటింగ్ ఆరోపణలతో ఐదుగురు అరెస్టు



అరెస్టైన నిందితులను చూపిస్తున్న పోలీసులు

● రూ.28 లక్షల నగదు, 5 సెల్‌ఫోన్లు సీజ్

బరంపురం: ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించి రెట్టింపు నగదు చెల్లిస్తామని చెప్పి మోసం చేసిన ఆరోపణలతో ఐదుగురు నిందితులను బరంపురం పెద్ద బజార్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం బరంపురం పోలీసు జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సార్వణ్ వివేక్ మాట్లాడుతూ.. నిందితులు రెట్టింపు నగదు చెల్లిస్తామని చెప్పి స్థానిక ప్రజల నుంచి కొద్ది నెలలుగా డిపాజిట్లు సేకరించి మోసం చేశారన్నారు. దీంతో అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.28 లక్షల నగదు, 5 సెల్‌ఫోన్లు సీజ్ చేశామన్నారు. అరెస్టైనవారిలో బరంపురం గణేష్ నగర్ 4వ లైన్‌కి చెందిన బద్రీనాథ్ పండా, జిల్లా కవిసూర్యనగర్‌కి చెందిన అక్ష



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు

య్ కుమార్ నాయక్, రౌత్ పెంట వీధికి చెందిన భవానీ శంకర్ పట్నాయక్, పురుషోత్తపూర్‌కి చెందిన రామచంద్ర పండా మరియు నిమాస్‌లు ఉన్నట్లు తెలియజేశారు. వారందరినీ బరంపురం జిల్లా కోర్టులో హాజరుపరిచి సర్కిల్ జైలుకి తరలించినట్లు ఐఐసీ అధికారి ప్రశాంత్ భూపతి తెలియజేశారు.

బిర్సాముండకు నివాళి



బిర్సాముండ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాయగడ: ఆదివాసీ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సాముండ 148వ జయంతిని జిల్లాలోని రామనగుడ సమితి తమిలిగుడ, గుణుపూర్‌లోని లుంగరుతల ప్రాంతాల్లో ఆదివాసీ సంఘర్ష మోర్చా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి సీపీఐ ఎంఎల్ (లిబరేషన్) జాతీయ స్థాయి పొలిట్ బ్యూరో సభ్యుడు తిరుపతి గొమాంగో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా బిర్సాముండ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆదివాసీల హక్కుల కోసం బిర్సా చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమాల్లో ఆదివాసీ సంఘాల నాయకులు అనాసిన్ సాబొరొ, బిజియల్ గొమాంగో, ఛంతి నిమల, శుక్రు సాబొరొ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ వలలో ప్రైవేటు ఉద్యోగి

● రూ.4 లక్షలు కాజేసిన మోసగాళ్లు

టెక్కలి రూరల్: చిరుద్యోగులు, ప్రైవేట్ కంపెనీ ఉద్యోగులు, యువతను లక్ష్యంగా చేసుకుని సైబర్ కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా టెక్కలి మండలం లింగాలవలస పంచాయతీ రంగాపురం గ్రామానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి సైబర్ మోసానికి గురయ్యాడు. పెద్దింటి శ్రీనివాసరావు అనే వ్యక్తి హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ఇటీవలే గ్రామానికి వచ్చారు. ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్‌లో రోజుకు మూడు నాలుగు గంటలు పనిచేస్తే వేలల్లో డబ్బులు వస్తాయని ఈ నెల 11న మెసేజ్ రావడంతో లింక్ డౌన్‌లోడ్ చేసుకున్నాడు. వారు ఇచ్చిన పని చెయ్యడంతో పెట్టుబడికి కొంత మొత్తం కలిపి యాప్‌లో జమ చేశారు. ఆ డబ్బులు విత్‌డ్రా కాకపోవడంతో వారు చెప్పినట్లు ఈ నెల 11, 12 తేదీ రూ.4లక్షలు వరకు జమ చేశాడు. చివరకు సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించి బుధవారం టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టెక్కలి ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కులగణనకు శ్రీకారం

● గార మండలం రామచంద్రాపురంలో పైలట్ ప్రోగ్రాంగా ప్రారంభం
● 27 నుంచి వ్యాప్తంగా నిర్వహణ
● జిల్లాలో ఇప్పటికే 151 కులాల గుర్తింపు



రామచంద్రాపురంలో పైలట్ ప్రోగ్రాం కింద కులగణన నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన బుధవారం ప్రారంభమైంది. పైలట్ ప్రోగ్రాం కింద జిల్లాలో గార మండలం రామచంద్రాపురంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో గుర్తించిన లోపాలను సవరించి ఈ నెల 27 నుంచి జిల్లా వ్యాప్తంగా కులగణన చేపట్టనున్నారు. జిల్లాకు సంబంధించి ఇప్పటికే 151 కులాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉంది. నాటి బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో 1931లో కులగణన జరిగింది. తర్వాత ఇంతవరకు కులగణన చేయలేదు. వివిధ రకాల సర్వేలు, లెక్కలు చేసినప్పటికీ ఉప కులాలు, కులాల పేర్లతో గణన నిర్వహించలేదు. కేవలం బీసీ, ఓసీ, ఎస్సీ, ఎస్టీ ఇలా మాత్రమే గణన చేశారు. ఈసారి కులం పేరిట గణన చేస్తుండటం గమనార్హం.

ప్రత్యేక యాప్‌లో నమోదు..

ఈ సారి కులగణనను గ్రామ, వార్డు సిబ్బంది నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. ప్రతి ఇంటి డేటా యాప్‌లో ముందుగానే పొందుపర్చి ఉంటుంది. వాటిని సరిచేసుకుని కుటుంబ పెద్ద ఆమోదించాల్సి ఉంటుంది. మొదటి దశలో ఇల్లు, భూములు, ఇతర వివరాలు, రెండో దశలో కులం, ఉప కులం, మతం, ఇతర వివరాలను ధ్రువీకరించాల్సి ఉంటుంది.

వారంలో రోజుల పాటు గణన

జిల్లాలో ఈ నెల 27 నుంచి ప్రారంభించి వారం లోపు గణన పూర్తి చేస్తారు. మరో పది రోజులు పాటు గ్రేస్ పీరియడ్ ఇస్తున్నారు. డోర్‌లాక్, వలసలు, వివిధ కారణాల వల్ల స్థానికంగా అందుబాటులో లేని వారి వివరాల్లో ఆ పది రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. 2016లో జరిగిన సర్వే ఆధారంగా ఇంటి నంబర్లు, సభ్యుల సంఖ్య ఉంటాయి. వాటిలో తొలగింపులు, చేర్పులు చేసుకునే వెసులుబాటు ఉంది.

కో ఆర్డినేటర్‌గా గణాంకాధికారి..

ఈసారి గణాంక శాఖ, బీసీ సంక్షేమ శాఖ, గ్రామ వార్డు సచివాలయాలు ఉమ్మడిగా సర్వే నిర్వహిస్తున్నాయి. సచివాలయ విభాగాధికారి పి.వాసుదేవరావు ఆధ్వర్యంలో జరిగే ఈ సర్వేకు కోఆర్డినేటర్‌గా ప్రణాళికా శాఖ జేడీ ప్రసన్నలక్ష్మి, బీసీ గణనకు కావాల్సిన సహకారం, వారిలో చైతన్యం కల్పించే బాధ్యతను బీసీ సంక్షేమాధికారి అనురాధకు అప్పగించారు.

17న రౌండ్ టేబుల్ సమావేశం..

జిల్లాలో బీసీ కుల సంఘాల ప్రతినిధులు, మేధావులు ఇతర వర్గాలతో ఈ నెల 17న శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులో బృందావన హోటల్లో రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కానుంది. ఇప్పటికే ఆయా కుల సంఘాల ప్రతినిధులకు సమాచారం అందజేశారు.

జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకే..

జిల్లావ్యాప్తంగా నవంబర్ 27 నుంచి కులగణన ప్రారంభిస్తామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ బుధవారం తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకటించారు. కుల గణన తర్వాత ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు. గణన పూర్తయ్యాక సచివాలయ పరిధిలో 10 శాతం ఇళ్లల్లో రీ వెరిఫికేషన్ చేసి గణన వివరాలను సరిపోల్చుతామని చెప్పారు. గ్రామ, మండల, డివిజనల్, జిల్లా స్థాయి అధికారులకు ఈ నెల 20 నుంచి 22 వరకు శిక్షణలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు.

క్లుప్తంగా

విద్యార్థులు వారికిష్టమైన రంగాన్ని ఎంచుకోవాలి

- బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర చైర్మన్ అప్పారావు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అప్పారావు, తదితరులు

విజయనగరం ఫోర్ట్: విద్యార్థులు తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని అందులో రాణించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా బాలల హక్కులపై రూపొందించిన వాల్ పోస్టర్‌ను స్థానిక కేజీబీవీలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 20 వతేదీవరకు బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి యాళ్ల నాగరాజు, మిషన్ వాత్సల్య సిబ్బంది జయలక్ష్మి, రామకోటి, వెన్నెల సంధ్య, చప్ప అరుణ్‌కుమార్, సతీష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జీఎంఆర్ ఐటీలో వెయిట్ లిఫ్టింగ్ జట్టు ఎంపిక



వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ తదితరులు

రాజాం సిటీ: అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ జట్టు ఎంపిక స్థానిక జీఎంఆర్ ఐటీలో బుధవారం జరిగింది. జట్ల ఎంపికకు సంబంధించిన పోటీలను జీఎంఆర్ ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ ప్రారంభించారు. ఈ పోటీలో జేఎన్‌టీయూ జీవీ పరిధిలోని కళాశాలల నుంచి పాల్గొన్న విద్యార్థులు వివిధ విభాగాల్లో సత్తా చాటారు. హోరాహోరీగా జరిగిన ఎంపికలో స్త్రీ, పురుషుల విభాగంలో వేర్వేరుగా జట్లను ఎంపిక చేశామని పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఎంపికైన మహిళలు డిసెంబర్ 4 నుంచి, పురుషులు డిసెంబర్ 8 నుంచి రాజమండ్రి లోని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

డివైడర్‌ను ఢీకొన్న ట్రాలర్



అదుపుతప్పిన ట్రాలర్

భోగాపురం: ఐరన్ లోడుతో విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ట్రాలర్ ముందు టైరు పంక్చర్ కావడంతో భోగాపురం మండలంలోని పోలిపల్లి జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పొక్లెయిన్ సహాయంతో ట్రాలర్‌ను పక్కకు తొలగించారు.


హిజ్రాల సేవానిరతి..



పైడితల్లి దీక్షాపరులకు కమలా పండ్లు అందజేస్తున్న కొండబాబు, తదితరులు

విజయనగరం టౌన్: పైడితల్లి మాలధారణ చేసిన భక్తులకు హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ వ్యవస్థాపక గౌరవాధ్యక్షుడు కొండబాబు ఆధ్వర్యంలో పలువురు హిజ్రాస్ విశేషమైన సేవలందించారు. ఇరుమడితో వచ్చే దీక్షాపరులకు పెద్దచెరువు ఒడ్డున ఉన్న విజయసాగర్ దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద మంచినీరు, టీ, కాఫీ, కమలాపండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షురాలు దవడ మీనా, కార్యదర్శి ప్రవంతి, సభ్యులు పాల్గొన్నారు.

సోదరభావం అలవర్చుకోవాలి



సోదరులకు తిలకం దిద్దుతున్న బీకే అన్నపూర్ణ

విజయనగరం టౌన్: ప్రతిఒక్కరూ సోదరభావాన్ని అలవర్చుకోవాలని బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రాల జిల్లా ఇన్‌చార్జి రాజయోగిని అన్నపూర్ణ అన్నారు. కంటోన్మెంట్ వద్దనున్న బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రంలో అన్నాచెల్లెళ్ల పండగ భాయ్ దూజ్‌ను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దివ్య సంబంధానికి ప్రతీకగా ఈ పండగను నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన వైద్యులు వెంకటేశ్వరరావు, శంకరరావు, సతీష్‌మూర్తి, గోపాలరావు, బీకే మాధురి, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

రారండోయ్ రామతీర్థం చూద్దాం..!

- చారిత్రక గుర్తులతో విరాజిల్లుతున్న పుణ్యక్షేత్రం
- కార్తీక సందడికి అనువైన ప్రదేశం
- ఈ నెలలో పెరగనున్న సందర్శకుల తాకిడి



రామతీర్థంలోని శ్రీరామస్వామివారి ఆలయం



బోడికొండ



ఎప్పటికీ ఎండిపోని నీటికొలను



దుర్గకొండపై జైనుల స్థూపం

నెల్లిమర్ల రూరల్: భక్తులు పరమ పవిత్రంగా భావించే కార్తీక మాసం రానే వచ్చింది. కార్తీకమాసంలో మహిళలతో సమానంగా పురుషులు అత్యంత భక్తి శ్రద్ధలతో నియమాలను పాటించి ఈ మాసమంతా దైవసందర్శనకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. పాఠశాలలు, కళాశాలల యజమాన్యం, వివిధ కుల, ఉద్యోగ సంఘాలు కార్తీక వనసమారాధన ఎక్కడ నిర్వహించాలో తర్జన, భర్జన పడుతుంటారు. తెలిసిన వారు మాత్రం కార్తీక వనసమరాధన రామతీర్థంలోనే నిర్వహించాలంటారు. తెలియని వారు రామక్షేత్ర మహత్యాన్ని తెలుసుకుని మరీ ఇక్కడికి వస్తుంటారు. ఈ మాసమంతా భక్తులు, సందర్శకులతో వనసమారాధనకు వచ్చే వారితో రామతీర్థం కిటకిటలాడుతుంది. ఇక్కడి స్వామిపై ఉన్న అపారమైన భక్తి, బోడికొండపై ఉన్న నాటి గురుతులు సుదూర ప్రాంతాల భక్తులను చెంతకు రప్పించుకుంటున్నాయి. ఒకవైపు ఎత్తైన బోడికొండ..మరోవైపు బౌద్ధులు నడియాడిన గురుభక్తుల కొండ, పాండవులు సంచరించిన ఆనవాళ్లు, ఎదుట పచ్చని నీటితో రామకోనేరు..ఇలా ఆ ప్రాంతమంతా సుందరంగా కనిపిస్తుంది.

రామతీర్థం పుణ్యక్షేత్రం కార్తీకవనసమారాధనకు అనుకూలమైన వేదికగా ఉంటుంది. ఒక వైపు రాముడు..ఇంకో వైపు ఉమాసదాశివుడి ఆలయాలు ఉండడంతో సాధారణ రోజుల కంటే కార్తీకమాసంలోనే భక్తులు ఇక్కడికి ఎక్కువగా రావడానికి ఇష్టపడుతుంటారు. పురాతన దేవాలయం, చారిత్రక ఆధారాలు గల ఎన్నో ఏళ్ల నాటి గురుతులు ఉండడంతో ఏటా సందర్శకుల తాకిడి పెరుగుతూ వస్తోంది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, వివిధ సంఘాల వారు కార్తీక వన సమారాధనను రామతీర్థంలోనే ఏర్పాటు చేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ చిన్న, పెద్ద తేడా లేకుండా ఆనందంగా గడుపుతారు.

బోడికొండపై అలనాటి గురుతులు–

క్షేత్రానికి ఉత్తరదిక్కున నీలాచలం పేరుగల రెండు కిలోమీటర్ల పొడవు గల ఏకాశిల పర్వతమే బోడికొండ. ఈ పర్వతంపై సీతారాములు, పాండవులు సంచరించి చిహ్నాలు ఉన్నాయి. అలాగే పర్వతాగ్రమున కోదండరాముని ఆలయం ఉంది. ఆలయం పక్కనే ఎప్పటికీ ఎండిపోని పాతాళగంగ పేరుతో నీటికొలను ఉంది. ఈ నీటి మడుగు నుంచి పడమర దిశగా ఇరుకురాయి దాని మధ్య నుంచి వెళితే భీమునిబుర్ర చిహ్నం ఉంటుంది. అక్కడే భీముడు వంట చేసేందుకు ఉపయోగించిన గాడిపొయ్యి కూడా ఉందని చెబుతుంటారు. దీనికి సమీపంలో ఉన్న గుహలో బుద్ధ విగ్రహం, పలుకురాయి ఉంది. ఇక్కడ ఒకసారి పిలిస్తే మూడుసార్లు ప్రతిధ్వనిస్తుంది. అలాగే పాండవుల ఐదు పంచలు, సీతమ్మవారి పురిటి మంచం తదితర చిహ్నాలు చెక్కుచెదరకుండా ఉన్నాయి. ఈ కొండ పక్కనే దుర్గాభైరవ కొండ, బౌద్ధుల నివాసగృహాలు ఉన్నాయి. చారిత్రక గుర్తులను చూసేందుకు భక్తులు, సందర్శకులు అధికసంఖ్యలో పర్వతంపైకి వెళ్తుంటారు.దిగువనున్న రామాలయంలో వైకుంఠనాథస్వామి, వేణుగోపాలస్వామి, లక్ష్మీదేవి, మాధవస్వామి, భూభుజంగ వరహాలక్ష్మీ స్వామి, ఆళ్వారుల సన్నిధి, శ్రీరామక్రతువు స్తంభం, సదాశివస్వామి వార్ల ఉపాలయాలు ఉన్నాయి. నిర్విరామంగా ప్రతినిత్యం పూజలు జరుగుతూనే ఉంటాయి

రామతీర్థానికి ఇలా చేరుకోవాలి

జిల్లా కేంద్రం విజయనగరానికి 13కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉండగా నెల్లిమర్లకు తూర్పుదిక్కున ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది. విజయనగరం–శ్రీకాకుళం వయా నెల్లిమర్ల రహదారిలో ఈ పుణ్యక్షేత్రం ఉంది. ఈ క్షేత్రానికి చేరుకోవడానికి విజయనగరం కోట నుంచి నేరుగా ప్రైవేట్ వాహనాలు ఉంటాయి. అలాగే శ్రీకాకుళం నుంచి వచ్చిన భక్తులు రణస్థలం మార్కెట్ వద్ద దిగి సతివాడ–నెల్లిమర్ల వాహనాలను ఆశ్రయించవచ్చు. రణస్థలం నుంచి 18కిలోమీటర్ల దూరం ఉంటుంది.

బోడికొండపై జాగ్రత్తలు తప్పనిసరి

బోడికొండపైకి వెళ్లే సందర్శకు తప్పని సరిగా జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. కోదండరామాలయం పక్కన నీటికొలను లోతుగా ఉంటుంది.అందులో భక్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ దిగరాదు.చారిత్రక గుర్తులను తెలిపే హెచ్చరిక బోర్డులను అనుసరించి సందర్శకులు వెళ్లాలి. కుమ్మరి వీధి మెట్ల మార్గం నుంచి పైకి చేరుకుని సీతమ్మవారి పురిటి మంచం(సీతారామునిపేట గ్రామం) మెట్ల మార్గం నుంచి కిందికి దిగాల్సి ఉంటుంది. మెట్లు అసౌకర్యంగా ఉన్నందున వయసు మళ్లిన వారు కొండ పైకి వెళ్లకపోవడమే మంచిది.

సమాజాభివృద్ధిలో గ్రంథాలయాల పాత్ర కీలకం

- ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ డీవీజీశంకరరావు



పుస్తకదాతలతో డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: సమాజాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో గ్రంథాలయాలది కీలకపాత్ర అని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీశంకరరావు అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తకదాతలు, గ్రంథాలయ నిర్వాహకులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ నేటి తరం యువత, విద్యార్థులంతా టీవీ, సెల్‌ఫోన్ల కన్నా పుస్తక పఠనానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని తద్వారా బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఎస్‌ఎస్ రాజు, కె.దయానంద్, అబ్దుల్ రవూఫ్, ఎర్నాయుడు, రామరాజు, మోసంగి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

27 మంది జేఎన్‌టీయూ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ)వర్సిటీలో 2023–24 విద్యా సంవత్సరానికి బుధవారం నిర్వహించిన ప్లేస్‌మెంట్ ప్రక్రియలో 27 మంది మంచి వేతనంతో ఉద్యోగాలు సాధించారు. ఈ మేరకు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి. ప్లేస్‌మెంట్‌లో అత్యధికంగా 27 మంది విద్యార్థులు మంచి వేతనంతో ఉద్యోగాలు పొందారు. మల్టీ నేషనల్ కంపెనీల్లో ఒకటైన ఎల్‌అండ్‌టీ సంస్థ ఇంటర్వ్యూలో అధికంగా 26 మంది ఎంపికయ్యారు. వారిలో మెకానికల్ 22 మంది, సివిల్ ఇంజినీరింగ్ నుంచి నలుగురు రూ.6.25 లక్షల వార్షిక వేతనంలో ఉద్యోగాలు సాధించారు. అలాగే ఈసీఈ విభాగం నుంచి రూ.6 లక్షల వార్షిక వేతనంతో మోసిప్ టెక్నాలజీస్ సంస్థలో ఒకరు ఉద్యోగం సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గురునాథ్, ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ టీఎస్ఎన్‌మూర్తి, వివిధ విభాగాల అధిపతులు అభినందించారు.

నిత్యజీవితంలో భౌగోళిక సమాచార వ్యవస్థ కీలకం

- డాక్టర్ పి.ఎస్.ఆర్.శ్రీనివాన శాస్త్రి
- సెంచూరియన్ వర్సిటీలో అంతర్జాతీయ భౌగోళిక సమాచార వ్యవస్థ దినోత్సవం



సమాచార వ్యవస్థపై సావనీర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

పర్లాకిమిడి: భౌగోళిక సమాచార వ్యవస్థతో నిత్యజీవితంలో ఎంతో మేలు జరుగుతుందని భారత రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థకు చెందిన డాక్టర్ పి.ఎస్.ఆర్.శ్రీనివాసశాస్త్రి అన్నారు. స్థానిక ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్ ఆడిటోరియంలో అంతర్జాతీయ భౌగోళిక సమాచార వ్యవస్థ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భౌగోళిక సమాచారం కోసం కేంద్ర ప్రభుత్వం శాటిలైట్ వ్యవస్థను కలిగి ఉందని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో కృత్రిమ మేధస్సు, నీటి వనరుల వినియోగం, అర్బన్ ప్లానింగ్, పర్యావరణం ఎలా కాపాడుకోవాలి, వ్యవసాయం, ఇతర అనుబంధ శాస్త్రం, విపత్తుల నివారణ, మెషిన్ లెర్నింగ్, సాంకేతిక పరిజ్ఞానం వంటి విషయాలపై ప్రపంచ వ్యాప్తంగా పరిశోధకులు, ఫ్యాకల్టీల నుంచి 282 పరిశోధన పేపర్లు అందగా, వాటిలో 169 ఎంపిక చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో వైజ్ఞానికుడు డా.పి.రాజా, సెంచురియన్ వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎన్.రావు, రిజిస్ట్రార్ డా.సుప్రియా పటానాయక్, డీన్ డా.అనితాపాత్రో, డా.ఆశిష్ రంజన్ దాస్, ప్రోగ్రాం కన్వీనర్ ప్రొ.ప్రఫుల్ల కుమార్ పండా, డాక్టర్ గిరీష్ చంద్ర కొటియారి పాల్గొన్నారు.

పొగతాగడం మానుకోవాలి

- సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్
- ఆస్పత్రి ఆవరణలో ర్యాలీ



ర్యాలీ చేస్తున్న సర్వజన ఆస్పత్రి వైద్యసిబ్బంది

విజయనగరం ఫోర్ట్: పొగతాగడం వల్ల ఆరోగ్యం పాడవుతుందని, కావున పొగతాగడం మానుకోవాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిలాసునందని పేర్కొన్నారు. ప్రపంచ సీఓపీడీ డే సందర్భంగా సర్వజన ఆస్పత్రిలో బుధవారం నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఓపీడీ రోగులు జిల్లాలో అధికంగా ఉన్నారని చెప్పారు. ఈ వ్యాధికి సకాలంలో వైద్యం చేయించుకోవాలని సూచించారు. పలమనాలజిస్టు డాక్టర్ బొత్స సంతోష్ మాట్లాడుతూ పొగతాగడం, పీల్చడం వల్ల సీఓపీడీ వస్తుందని తెలిపారు. ఒక వ్యక్తి 100 సిగరెట్లు తాగితే అతనికి 40 ఏళ్లు వచ్చేసరికి సీఓపీడీ వచ్చే ఆస్కారం ఉందన్నారు. కాబట్టి యుక్త వయసులో ఉన్నాం, తమకేమీ కాదనే భావనను విడనాడాలని హితవు పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్‌లు పీఏ రమణి, అజయ్‌కుమార్, డాక్టర్ చైతన్యబాబు, డాక్టర్ రామకృష్ణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం



108లో ఆరోగ్యంగా తల్లీబిడ్డలు

రేగిడి: మండలంలోని మంగళాపేట గ్రామానికి చెందిన గాయత్రి పండంటి మగబిడ్డకు 108 వాహనంలో జన్మనిచ్చింది. ఏడునెలల గర్భిణి అయిన గాయత్రికి ఉన్నపళంగా బుధవారం పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు 108 వాహనానికి సమాచారం అందించగా వాహనంలో వచ్చిన ఈఎంటీ ఆమె ప్రాథమిక చికిత్స అందిసుండగా..పైలెట్ నారాయణరావు వాహనంలో రాజాం సామాజిక ఆస్పత్రికి తరలిస్తున్నాడు. అంతలో మార్గమధ్యంలోనే ఆమె ప్రసవించింది. అనంతరం తల్లీబిడ్డలకు ఇబ్బందిలేకుండా 108 సిబ్బంది వైద్యం అందించి రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతిచెందిన తిరుపతిరావు

జామి: మండలంలోని గ్రీన్‌ఫీల్డ్ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని గంట్యాడ మండలం లక్కిడాం గ్రామానికి చెందిన కిలపర్తి తిరుపతిరావు(48) మృతిచెందాడు. వివరాలిలా ఉన్నా యి. కంటకాపల్లిలోని శారద కంపెనీలో పనిచేస్తున్న తిరుపతిరావు ప్రతిరోజూ కంపెనీకి, అక్కడి నుంచి ఇంటికి గ్రీన్‌ఫీల్డ్ హైవే పైనుంచి బైక్‌పై వెళ్లి వస్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తున్న సమయంలో జామి సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ హైవేపై గుర్తు తెలియని వాహ నం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్సై లోవరాజు తెలిపారు.

బైక్‌ను కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

పార్వతీపురం టౌన్: కొమరాడ మండలం మాదలంగి గ్రామానికి చెందిన రాగాల కృష్ణమూర్తి తన భార్య లక్ష్మితో బైక్‌పై పార్వతీపురం వస్తుండగా తోటపల్లిలోని కర్రల మిల్లు సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణమూర్తికి తీవ్రగాయాలు కావడంతో భార్య లక్ష్మి పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తీసుకురాగా వైద్యులు చికిత్సనందించారు.

కస్పా విద్యార్థులకు అభినందనలు



ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన లిఖిత్ కుమార్



ఖోఖో పోటీలకు ఎంపికైన షేక్‌సలీంతో పాఠశాల హెచ్‌ఎం శంకరరావు

విజయనగరం: విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడాప్రతిభను వెలికితీసేందుకు ప్రతి ఏడాది నిర్వహించే స్కూల్‌గేమ్స్ పోటీల్లో విజయనగరంలోని కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటుతున్నారు. పలు క్రీడాంశాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తూ ప్రతిభను నిరూపించుకుంటున్నారు. అండర్–19 విభాగంలో జమ్ము కశ్మీర్‌లో నిర్వహించే జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్య పతకం సాధించిన కస్పా పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థి ఆర్.లిఖిత్‌కుమార్ ఎంపికయ్యాడు. అలాగే ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు కాకినాడలో జరగబోయే అండర్–17 బాలుర ఖోఖో పోటీలకు విద్యార్థి షేక్ సలీం ఎంపికయ్యాడు. రాష్ట్ర, జాతీయ పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కె.గోపాల్, సౌదామిని తదితరులు అభినందించారు.

రజత పతక విజేతకు డిప్యూటీ స్పీకర్ అభినందన



తైక్వాండో పోటీల్లో రజత పతక విజేతను అభినందిస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో రజత పతకం సాధించిన కార్తీక్‌ను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రత్యేకంగా అభినందించారు.ఈ మేరకు ఆ విద్యార్థికి రజత పతకం, ప్రశంసా పత్రాన్ని అందజేసి ప్రోత్సహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల కడపలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో 9వ తరగతి చదువుతున్న కార్తీక్ రజత పతకం కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ క్రీడారంగంలో నగర ఖ్యాతిని మరింత ఇనుమడింప జేసేందుకు యువ క్రీడాకారులు మరింతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి క్రీడలకు ఎంతో ప్రోత్సాహం ఇస్తున్నారన్నారు. విద్యతో పాటు క్రీడలలో మంచి ప్రతిభ కనబరిచి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్ సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే స్పందన

- జేసీ మయూర్ అశోక్



వినతులను ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది



అర్జీలు సమర్పిస్తున్న దరఖాస్తుదారులు

బాడంగి: మండలస్థాయిలోనే ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపిస్తోందని అందులో భాగంగానే జగనన్నకు చెబుదాం పేరుతో స్పందన కార్యక్రమాన్ని చేపట్టినట్టు జేసీ మయూర్ అశోక్ చెప్పారు. ఈ మేరకు బాడంగి మండలపరిషత్ సమావేశ భవనంలో స్పందన కార్యక్రమాన్ని జిల్లా, మండల అధికారులతో కలిసి బుధవారం ఆయన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల నలుమూలల నుంచి వచ్చిన వారు సుమారు 38 వినతులు అందజేశారు. వాటిలో ముఖ్యంగా స్థానిక గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వాడుకనీరులేక అవస్థలు పడుతున్నారని బోరు, 5హెచ్‌పీ మోటార్ అవసరమని విన్నవించారు. తమగ్రామంలో ఎక్కువమందివి జాయింట్ ఖాతాలు ఉన్నాయని, ఆన్ గ్రౌండ్‌లో ఒకరైతుఉంటే ఆన్‌లైన్‌లో మరొకరి పేరుందని, భర్తచనిపోతే భార్యపేరున ఆన్‌లైన్ వన్‌బీలు రావడంలేదని, పాస్‌పుస్తకాలకు, ఆన్‌లైన్ భూముల విస్తీర్ణానికి పొంతన లేదని భీమ గ్రామానికిచెందిన రైతులు అర్జీ సమర్పించారు. దీనిపై స్పందించిన జేసీ ఆ గ్రామానికి వెళ్లి తొలుత జాయింట్ ఎల్‌పీసీలను విడగొట్టేలా చర్యలు చేపట్టాలని ఆర్డీఓ సాయిశ్రీని ఆదేశించారు. స్పందన కార్యక్రమానికి జేసీతో పాటు జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్, ఆర్డీఓ సాయిశ్రీ, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ జేడీ తారక రామారావు, విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, డీఎంహెచ్ఓ భాస్కరరావు, ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, డీపీఓ నిర్మలాదేవి, సర్వేశాఖ ఎ.డి త్రివిక్రమరావు, డీఈఈలు, తహసీల్దార్ రఫీజాన్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సూర్యనారాయణ, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. తెర్లాం ఇన్‌చార్జ్ ఎస్సై రమేష్ ఏఎస్సై కొండలరావు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

డిసెంబర్ 2,3 తేదీలలో ప్రత్యేక ఓటరు నమోదు

- జాయింట్ కలెక్టర్ గోవిందరావు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోవిందరావు

పార్వతీపురం: డిసెంబర్ 2,3 తేదీలలో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకునేలా తెలియజేయాలని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 7,70,525 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో పురుషులు 3,76,220, స్త్రీలు 3,94,240, థర్డ్ జెండర్ 65 మంది ఉన్నారని తెలిపారు. 2024 జనవరి 5న తుది జాబితా ప్రచురణకు సిద్ధమవుతుందని స్పష్టం చేశారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం రోజుల్లో పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ స్థాయి అధికారులు ఉంటారని పేర్కొన్నారు. బూత్ స్థాయి అధికారుల వద్ద ఫారం- 6, ఫారం-7, ఫారం-8 అందుబాటులో ఉంటాయని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు మాట్లాడుతూ పారదర్శకమైన ఓటరు జాబితా తయారీకి ముసాయిదా ఓటరు జాబితాలో గల అభ్యంతరాలను తెలియజేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా చేర్చాలని, చనిపోయిన, శాశ్వతంగా వలసపోయిన, పెళ్లైన, అనర్హులైన వారి పేర్లను తొలగింపులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో టీడీపీ ప్రతినిధి జి.వెంకటనాయుడు, బీజేపీ ప్రతినిధి పి.అప్పారావు, లోక్ సత్తా ప్రతినిధి ఎ.ప్రభాకరరావు, ఆప్ ప్రతినిధి పి.రవికుమార్, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి ఎస్.ఉమామహేశ్వరరావు, జనసేన ప్రతినిధి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

72 మద్యం సీసాలు,14 లీటర్ల మద్యం సీజ్



కల్తీ మద్యం సీసాలు, విడిగా సీసాల్లోంచి తీసిన 14 లీటర్ల మద్యాన్ని, సీజ్ చేసిన ఎస్ఈబీ పోలీసులు

కొత్తవలస: మండలంలో కొంతకాలంగా పెద్ద ఎత్తున మద్యం కల్తీ జరుగుతోంది. ఈ అంశాన్ని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ సీహెచ్.రాజేశ్వరి, ఎస్సై పి.నరేంద్రకుమార్ సవాల్‌గా తీసుకుని నిఘా పెట్టారు. దీంతో కొత్తవలస మండల కేంద్రంలో జరుగుతున్న కల్తీ దందాను బుధవారం పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.

మండల కేంద్రంలోని సంతమార్కెట్ సమీపంలో గల ప్రభుత్వ మద్యం దుకాణం షాపునంబర్-02138లో లక్కవరపుకోట మండలం గంగుబూడి గ్రామానికి చెందిన దొడ్డ కొండలరావు కొద్దికాలంగా సేల్స్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఆయన సబ్బవరం రోడ్డులో ఒక అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ అద్దెకు తీసుకుని మద్యం కల్తీకి పాల్పడుతున్నట్లు ఎస్ఈబీ పోలీసులు గుర్తించారు. మద్యం షాపులో కేసులను చాటుమార్గంలో అపార్ట్‌మెంట్‌కు తరలించి మద్యం సీసాల మూతలను జాడ లేకుండా తొలిగించి అందులో కొంత మద్యాన్ని తీసి వేరే బాటిల్స్‌లో నింపుతున్నాడు. ఆ ఖాళీకి నీళ్లుపోసి యథావిధిగా మూతలు పెట్టి మళ్లీ సంబంధిత కేసులను షాపులోకి తరలించి విక్రయిస్తున్నాడు. మద్యం సీసాల్లోంచి తీసిన మద్యాన్ని వేరే బాటిల్స్‌లో నింపి బెల్టు షాపులకు విక్రయిస్తున్నట్లు ఎస్ఈబీ అధికారులు గుర్తించారు. ఈ మేరకు సంబంధిత అపార్ట్‌మెంట్ దగ్గర మాటువేసి తనిఖీ చేసి కల్తీ చేసిన 72 క్వార్టర్ బాటిల్స్, మద్యం బాటిల్స్ నుంచి సేకరించిన 14 లీటర్ల మద్యాన్ని గుర్తించి సీజ్ చేశారు. అనంతరం నిందితుడు కొండలరావును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు సీఐ రాజేశ్వరి తెలిపారు.